క్లుప్తంగా

నూతన బస్ సర్వీస్ ప్రారంభం



నూతన సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

ఉక్కునగరం: స్టీల్ సిటీ డిపో నుంచి నూతన బస్ సర్వీస్ ప్రారంభమైంది. లంకెలపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్ సెక్టార్–12, ఉక్కు జనరల్ ఆస్పత్రికు తిరిగే ఈ బస్సును మంగళవారం డిపోలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు, డిపో మేనేజర్లు గౌతమ్ చటర్జీ, కె. గంగాధర్, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి. శ్రీనివాసరావుతో పాటు డిపో అధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖోఖోలో ఢిల్లీశ్వరి ప్రతిభ



ట్రోఫీతో ఢిల్లీశ్వరి

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 23, 24, 25 తేదీల్లో పల్నాడు జిల్లా కారంపూడిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 ఖోఖో పోటీల్లో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విశాఖ జట్టులో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని ఆర్.ఢిల్లీశ్వరి సత్తాచాటి బెస్ట్ క్రీడాకారిణిగా ట్రోఫీ అందుకుంది. ప్రతిభ కనబర్చిన ఢిల్లీశ్వరికి మంగళవారం పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, అభినందనలు తెలిపినట్లు పీడీ ఇస్మాయిల్ తెలిపారు.

దీపారాధన విశిష్టత తెలుసుకోవాలి



ఇంటింటి ప్రచారంలో సేవా సమితి సభ్యులు

అగనంపూడి: కార్తీక మాసంలో దీపా రాధన విశిష్టత, ప్రాధాన్యతను తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార సమితి ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో దేవి, పద్మ, లక్ష్మి, దయ, నాగమణి, రమణ పాల్గొన్నారు.

సందడిగా వన భోజనాలు



ఉక్కు శివాలయంలో వన భోజనాల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయం ఆవరణలో కార్తీక వనభోజనాలు సందడిగా జరిగాయి. రా మెటీరియల్స్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగం ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోవాలని, భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు లేకుడా చూడాలని మహాదేవునికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంహెచ్‌పీ విభాగాధిపతి హల్దార్, మెకానికల్ ఇన్‌చార్జి డి.జె.ఆర్. శ్రీనివాస్, ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు, ఎం. నారాయణ, జామినాయుడు, ఎస్. అప్పలరాజు, జనార్దన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశునికి విశేష పూజలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా శ్రీవారికి నిత్య పూజలు విశేషంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం బాలాజీను భక్తులు దర్శించుకుని పులకించిపోయారు.

మహిళా చైతన్యం



గాజువాక మహిళా రైతు బజారులో కూరగాయల స్టాళ్లు

గాజువాక రైతు బజారులో అంతా నారీమణులే

ఆకాశంలో సగం.. అవకాశంలో సగం అంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు మహిళలు. చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన మహిళలు కొందరైతే.. మగవారితో సమానంగా పొలం పని చేయడంతో పాటు వ్యాపారాలు చేస్తూ కుటుంబానికి సహకారం అందిస్తున్నారు మరికొందరు అతివలు. శ్రమైక జీవన సౌందర్యానికి నిర్వచనంగా నిలుస్తున్నారు. ఆ కోవకే చెందుతారు గాజువాక మహిళా రైతు బజారులోని రైతులు. – గాజువాక



ఆకుకూరలు విక్రయిస్తున్న మహిళా రైతు

గాజువాకలో 2001లో ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను 2013లో మహిళా రైతుబజార్‌గా మార్చారు. 53 దుకాణాలున్న ఈ రైతు బజార్‌లో అన్ని రకాల కూరగాయలతో పాటు ఇతర నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ నియంత్రణలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎంపిక చేసిన 35 మంది మహిళా రైతులు ప్రతిరోజు ఇక్కడికి కూరగాయలు తీసుకొస్తారు. పండించిన కూరగాయలను ఏరోజుకారోజే తీసుకువస్తుండడంతో తాజాగా లభిస్తాయి.

దూరమైనా..

గాజువాక మహిళా రైతు బజారుకు కె.కోటపాడు (సంతపాలెం), దుంబ్రిగుడ, రావికమతం, మాకవరపాలెం, సబ్బవరం, కశింకోట, పెందుర్తి, నర్సీపట్నం ప్రాంతాలకు చెందిన రైతులు ప్రతిరోజు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తారు. వీరితోపాటు గిరిజన ప్రాంతమైన అరకు నుంచి కూడా రైతులు తమ ఉత్పత్తులను ఇక్కడికి తీసుకొస్తారు. గిరిజన ఉత్పత్తులను విక్రయించడం కోసం జీసీసీ కౌంటర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. సూపర్‌బజార్‌కు చెందిన స్టాల్ కూడా వివిధ రకాల నిత్యావసరాలను అందుబాటులో ఉంచింది.

నాడు వెలవెల.. నేడు కళ కళ

ఈ బజారులో ఒకప్పుడు కొనుగోలుదారులు లేక బేలచూపులు చూసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కొనుగోలుదారులతో నిత్యం కిటకిటలాడే స్థాయికి చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు తమ ఉత్పత్తులతో అర్ధరాత్రి రెండు, మూడు గంటలకల్లా రైతు బజార్‌కు చేరుకుంటారు. కూరగాయలతోపాటు ఉల్లిపాయలు, బంగాళాదుంపలను భారీగా విక్రయిస్తారు. పండ్లు, బియ్యం, గిరిజన ఉత్పత్తులు విక్రయించే కౌంటర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

తాజా కూరగాయలు తీసుకొస్తాం



మా పొలాల్లో పండిస్తున్న కూరగాయలను ఏరోజుకారోజే కోసి తీసుకొస్తాం. ఇక్కడ కూరగాయలు అమ్ముకొని తిరిగి ఇంటికి చేరిన తర్వాత పొలంలోకి వెళ్లి రేపటి కోసం కూరగాయలు సిద్ధం చేసుకుంటాం. తెల్లవారుజాముకల్లా తీసుకొచ్చి అందుబాటులో ఉంచుతాం.

– సీహెచ్.వరలక్ష్మి, రైతు, కె.సంతపాలెం

ఆదరణ బాగుంది



మేము కూరగాయలతోపాటు పండ్లు కూడా పండిస్తాము. మా తోటల్లో పండే పండ్లతోపాటు బయట లభించే కొన్ని పండ్లు కూడా తీసుకొచ్చి విక్రయిస్తాను. బజారులో ఆదరణ బాగుంది.

– జి.నూకాలమ్మ, రైతు, కె.కోటపాడు

కష్టం మరిచిపోతాం



మేం ఎంతో దూరం నుంచి ఇక్కడికి కూరగాయలు తీసుకొస్తాం. అవి మధ్యాహ్నానికల్లా అమ్ముడైపోతాయి. దీంతో మాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఆదాయం కూడా గిట్టుబాటు అవడంతో కష్టం అనిపించదు.

– ఎస్.లక్ష్మి, రైతు, కేకే అగ్రహారం

ఇదెక్కడి ఆటవిక న్యాయం?

ఉక్కు పోరాట కమిటీ ఛైర్మన్ ఆదినారాయణ



దీక్షలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించకుండా మానసికంగా వేధించడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం చేపట్టిన 1384వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. రెండు మాసాల నుంచి జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. కర్మాగార ప్రగతి, ఉత్పత్తిలో కీలకమైన కార్మికులు, ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా వేధించడంతో యాజమాన్యం వైఖరి స్పష్టమౌతుందన్నారు. ఏడు మాసాలుగా జీతాలు వాయిదా పద్ధతిలో చెల్లించిన యాజమాన్యం రెండు మాసాల నుంచి వాటిని కూడా చెల్లించకుండా ఉద్యోగుల కుటుంబాలను దారుణంగా హింసిస్తుందన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, విళ్లా రామ్మోహన్‌కుమార్, ఎం.మహాలక్ష్మినాయుడు, దాసరి సురేష్‌బాబు, శ్రీనివాస్, ఎ.మసేన్ రావు, డి.దేముడు, జి.ఆనంద్, ఎం.కె.వి.రాజేశ్వర రావు, సన్నిబాబు, సీతారామరాజు, రాంబాబు, భాష, పాల్గొన్నారు.

రోడ్ టు స్కూల్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రమణాజీ

పెదగంట్యాడ: ఒకటో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయి సంప్రదాయ లిఖిత, గణన నైపుణ్యాలను పెంపొందించేందుకు రోడ్ టు స్కూల్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మండల విద్యా శాఖాధికారి కె.రమణాజీ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని కేఎస్ పాలెం ఎంపీపీ పాఠశాలలో రోడ్ టు స్కూల్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల మానసిక స్థితి అంచనా వేయడంలో, తల్లిదండ్రుల సమక్షంలో వారికి వ్యక్తి గతంగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఆర్‌టీఎల్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, హెచ్‌ఎన్‌పీసీఎల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 13 ఎంపీపీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లు, లోడర్ల నిరసన



ఆందోళనలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు, లోడర్లు

గాజువాక: జీతాలు సకాలంలో చెల్లించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ కోసం తమ జీతాల నుంచి మినహాయిస్తున్న నగదును ఆయా సంస్థలకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోన్ క్లాప్ ఆటో డ్రైవర్లు, లోడర్లు మంగళవారం బంద్ నిర్వహించారు. కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బంద్‌తో తడి, పొడి చెత్త సేకరించే వాహనాలు పార్కింగ్ స్థలంలోనే నిలిచిపోయాయి. తమ జీతాలు చెల్లించే వరకు బంద్ కొనసాగిస్తామని ఈ సందర్భంగా కార్మికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, నాయకులు ఎం.రాంబాబు, నక్క నాగరాజు, ఎస్.గణేష్, అనిల్, సురేష్, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శివ పార్వతుల కల్యాణం

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కులోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు తిప్పల నితీష్‌రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, శ్రీరామ్మూర్తి, కణితి అప్పలరాజు, గురునాథ్, సాంబ, సత్యం పాల్గొన్నారు.

పందుల ఏరివేత

సాక్షి ఎఫెక్ట్..



బీసీ రోడ్డులో పందులను కాల్చి పడేసిన హంటర్

పెదగంట్యాడ: మండలంలో పందులు మళ్లీ స్వైర విహారం చేస్తున్న నేపథ్యంలో 'అదే కథ.. తప్పని వ్యథ' అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగ అధికారులు స్పందించారు. విచ్చల విడిగా సంచరిస్తున్న పందులను జీవీఎంసీ అధికారులకు ఏరివేశారు. హంటర్‌తో షూట్ చేయించారు. దీంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జీవీఎంసీ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ ద్వారా మండలంలో సంచరిస్తున్న పందులను ఏరి వేస్తామన్నారు.

సభ్యులు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



మాట్లాడుతున్న లంకెలపాలెం పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ

అగనంపూడి: లంకెలపాలెం వ్యవసాయ ప్రాథమిక సహకారం సంఘంలో సభ్యులు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తే వెంటనే ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని లంకెలపాలెం పీఏసీఎస్ కార్యదర్శి పి.సత్యనారాయణ చెప్పారు. అగనంపూడ సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీలో 6806 మంది సభ్యులు ఉన్నారని, వారిలో సగం మంది మాత్రమే ఆధార్ అనుసంధానం చేసుకున్నారన్నారు. సభ్యుల్లో ఎవరైనా మరణించి ఉంటే అటువంటి వారి వారసులు సంబంధిత పత్రాలు జతచేసి దరఖాస్తు చేస్తే వారి మూలధనం సొమ్మును తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. అగనంపూడి నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, సొసైటీ సభ్యులు సాలాపు అచ్చిబాబు, గంతకోరు అప్పారావు,చందక చిన్నారావు, గళ్ల సూర్యనారాయణ, పడాల సత్యనారాయణ, వద్దాది శ్రీను, మొల్లి కోటేశ్వర రావు, అప్పారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువుల అందజేత



అంగన్‌వాడీ సెంటర్‌కు పలు వస్తువులు అందజేస్తున్న ఎస్‌బీఐ పాన్ ఇండియా ప్రతినిధి లక్ష్మీ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సీఎస్‌ఆర్ ఎస్‌బీఐ పాన్ ఇండియా యాక్టివిటీ ఆధ్వర్యంలో పుస్తకాలు, టీవీ, వాటర్ ఫిల్టర్, రైస్ కుక్కర్, కలర్స్ మెటీరియల్స్, చార్ట్స్ వంటి వస్తువులను అందజేశారు. సీడీపీవో నీలవేణి ఆధ్వర్యంలో మంగళవారం అమరావతి సర్కిల్ నుంచి మిత్రా హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మెన్ లక్ష్మీ రెడ్డి వీటిని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రుక్సానా బేగం, దుర్గాబాయి, సిబ్బంది సీత, ఈశ్వరమ్మ, వెంకటరత్నం పాల్గొన్నారు.

రాజ్యాంగంతో అన్ని వర్గాలకు గుర్తింపు

- వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు దేవన్‌రెడ్డి
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

గాజువాక: ప్రపంచ దేశాలు సైతం గర్వంగా చెప్పుకొనే రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దేశానికి అందించారని వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీసీ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని మతాలు, కులాలకు సమన్యాయం కల్పించడమే అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం విశిష్టత అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడివాడ లతీష్, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీనివాసరావు, కోమటి శ్రీనివాసరావు, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, చిత్రాడ వెంకట రమణ, బొడ్డ గోవింద్, ఉమాదేవి, బోగాది సన్ని, ఇరోతి గణేష్, పల్లా పెంటారావు, లోకనాథం, వాసు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల ప్రతిజ్ఞ

రాజ్యాంగాన్ని కాపాడతామని గాజువాక న్యాయమూర్తులు ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 13 అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావుతోపాటు న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, వి.పల్లవి, పి.ప్రదీప, సెంట్రల్ నాజర్ సీతారామ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెదగంట్యాడ: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాబు జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ జంక్షన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవిందరాజు,టేకేటి పెంటయ్య, కాకినాడ పెంటారావు పాల్గొన్నారు.

విలువైనది మన రాజ్యాంగం

అగనంపూడి: భారత రాజ్యాంగం విశిష్టతను పౌరులందరూ తెలుసుకోవాలని 79వ వార్డు లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. లంకెలపాలెం హైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వేషధారణల్లో అలరించారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు దేవన్‌రెడ్డి

- మహిళలకు రాజ్యాంగంలో పొందుపర్చిన అన్ని హక్కులను కల్పించాలని విద్యార్థినులు కోరారు. జీవీఎంసీ 69వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం పాల్గొన్నారు.
- దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు నివాళులర్పించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయమూర్తులు



వివిధ వేషధారణల్లో విద్యార్థులు

విద్యార్థులకు రాజ్యాంగం విశిష్టతపై పలు పోటీలు నిర్వహించారు.

- అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు , సింగిడి సింహాచలం , మోహన్, నాగబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 87వ వార్డు కణితి అంబేడ్కర్ కాలనీలో కేవీపీఎస్ స్టీల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్ రాజ్యాంగం విశిష్టతను వివరించారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పరిహాసం చేస్తున్నాయని, హక్కులను కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. సీఐటీయూ నాయకులు కృష్ణారావు ,వై.టి.దాస్, బలిరెడ్డి శ్రీకాంత్, ప్రకాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం జెడ్పీహై స్కూల్లో రాజ్యాంగ దినోత్సవంపై చర్చ నిర్వహిస్తున్న విద్యార్థినులు



నివాళులర్పిస్తున్న లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయం, బిల్లును ప్రవేశ పెట్టడం, ఆ బిల్లును సభ ఆమోదించడం తదితర అంశాలను కళ్లకు కట్టారు. స్పీకర్‌గా, పార్లమెంట్ సభ్యులుగా, మంత్రులుగా విద్యార్థులు వ్యవహరించి ఆకట్టుకున్నారు. రాజ్యాంగ ప్రవేశిక సారాంశాన్ని ఏకపాత్రాభినయం ద్వారా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అప్పలరాజు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజాన మంగమ్మ, సరస్వతి, విజయలక్ష్మి, గౌరీ, నరసింహ, మాధవి పాల్గొన్నారు.



మాక్ పార్లమెంట్‌లో మాట్లాడుతున్న విద్యార్థిని

ఉక్కునగరం: భారత రాజ్యాంగం మహోన్నతమైనదని స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్. కరుణరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీవీవో, స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎం. మధుసూదనరావు మీటింగ్ హాలును ప్రారంభించారు. అంతకు ముందు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జీఎంలు టి.కె.ఎస్.ఆర్. ఠాగూర్, డి.విజయకుమార్, ఎస్. భాను,డీజీఎంలు డి. రాధిక, మనోజ్ ఓరాన్, బాబూనాయక్, ఎస్. సుందరం, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తాడన్న, బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ, ఎస్. మోహన్‌బాబు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కరుణరాజు, అధికారులు



స్టీల్‌ప్లాంట్‌లో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న రాజశేఖర్, నాయకులు



పెదగంట్యాడ ఫైర్‌స్టేషన్ జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు..



చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కణితిలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్